

పెళ్లికి దాచిన నగదు అపహరణ

పెళ్లి కోసం దాచిన నగదుతో పాటు నగలను దుండగులు అపహరించారు. కళ్యాణదుర్గం మండలంలో ఘటన జరిగింది. 8లో



టన్ను చీనీ రూ.32 వేలు

అనంతపురం వ్యవసాయ మార్కెట్‌యార్డులో గురువారం టన్ను చీనీకాయలు గరిష్టంగా రూ.32 వేలు, కనిష్టంగా రూ.12 వేల మేర ధర పలికాయి.

గరిష్టం/కనిష్టం
36.6°/23.8°

జిల్లా అంతటా గురువారం పగలు, రాత్రి ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమైంది. గాలి వేగం తగ్గడంతో ఉక్కపోత నెలకొంది.

న్యూస్‌రీల్

కేసుల పరిష్కారానికి కృషి చేయండి



మాట్లాడుతున్న జిల్లా ప్రిన్సిపల్ జడ్జి శ్రీనివాస్

అనంతపురం: ఉమ్మడి జిల్లాలో ఈ నెల 29న నిర్వహించే జాతీయ లోక్ అదాలత్‌లో కేసుల పరిష్కారానికి కృషి చేయాలని జిల్లా ప్రిన్సిపల్ జడ్జి జి. శ్రీనివాస్ అన్నారు. అనంతపురం జిల్లా కోర్టులోని తన చాంబర్‌లో గురువారం సమీక్ష నిర్వహించారు. కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్, శ్రీ సత్యసాయి జిల్లా జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్, అనంతపురం జిల్లా ఎస్పీ గౌతమి శాలి, శ్రీ సత్యసాయి జిల్లా ఎస్పీ ఎస్వీ మాధవ రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా జడ్జి మాట్లాడుతూ.. పోక్సో కేసుల కింద నష్ట పరిహారానికి సంబంధించి ముగ్గురు బాధితులకు ఒక లక్ష, రూ.2.50 లక్షలు, రూ.5 లక్షల చొప్పున పరిహారం మంజూరు చేశామన్నారు. బాధితులకు పరిహారం అందించేందుకు హైకోర్టుకు విన్నవించినట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా పలు పాలనా పరమైన అంశాలపై చర్చించారు. అనంతరం ఆర్డీటీ ప్రోగ్రాం డైరెక్టర్ మాంఛో ఫెర్రర్‌ను సత్కరించారు. లోక్ అదాలత్‌లో కేసుల పరిష్కారం, ఇతర సమస్యల పట్ల ఆయన స్పందనకు ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలియజేశారు.

ఒకేషనల్ ట్రైనర్స్‌కు రెన్యూవల్

అనంతపురం ఎడ్యుకేషన్: ఎంపిక చేసిన ఉన్నత పాఠశాలలు, కేజీబీవీలు, మోడల్ స్కూళ్లల్లో పని చేస్తున్న ఒకేషనల్ ట్రైనర్లకు 2024–25 విద్యా సంవత్సరానికి రెన్యూవల్ చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. జిల్లాలో 50 స్కూళ్లలో ఒకేషనల్ ట్రైనర్లు పని చేస్తున్నారు. టైలరింగ్, బ్యూటీషియన్ అండ్ వెల్‌నెస్, ఐటీ తదితర కోర్సుల్లో విద్యార్థులకు శిక్షణ ఇవ్వనున్నారు. గత ఏడాది పని చేసిన స్కూళ్లల్లో వెంటనే రిపోర్ట్ చేసుకోవాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. సమగ్రశిక్ష ఆధ్వర్యంలో పని చేస్తున్న వీరికి సమగ్రశిక్ష కార్యాలయం నుంచి ఉత్తర్వులు జారీ చేశారు.

ప్రజలకు మెరుగైన సేవలందించాలి



తహసీల్దార్ కార్యాలయంలో అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ వినోద్‌కుమార్

తాడిపత్రి టౌన్: ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని కలెక్టర్ వినోద్‌కుమార్ అన్నారు. తాడిపత్రి తహసీల్దార్ కార్యాలయాన్ని గురువారం ఆయన తనిఖీ చేశారు. రికార్డులు పరిశీలించారు. అనంతరం కార్యాలయ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమయ పాలన పాటించాలన్నారు. విధుల్లో ఎక్కడా నిర్లక్ష్యం ప్రదర్శించ రాదన్నారు. అనంతరం స్థానిక బాలుర హాస్టల్‌ను కలెక్టర్ తనిఖీ చేశారు. తాగునీరు, మరుగుదొడ్ల మరమ్మతులు త్వరితగతిన చేపట్టాలన్నారు. విద్యార్థుల సంఖ్యను పెంచాలన్నారు. కార్యక్రమంలో సాంఘిక సంక్షేమశాఖ జేడీ మధుసూదన్‌రావు, ఏఎస్‌డబ్ల్యూఓ పక్కీరయ్య, తహసీల్దార్ ఆంజనేయులు, ఆర్ఐ కరుణాకర్‌రెడ్డి, సీఎస్‌డీటీ రాజారాం పాల్గొన్నారు.

బీసీ సంక్షేమ వసతి గృహాల్లో ప్రవేశాలకు దరఖాస్తులు



అనంతపురం రూరల్: బీసీ సంక్షేమ వసతి గృహాల్లో ఖాళీగా ఉన్న సీట్ల కోసం అర్హులైన విద్యార్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు బీసీ సంక్షేమశాఖ డిప్యూటీ డైరెక్టర్ కుష్బూకొఠారి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని తాడిపత్రి, కళ్యాణదుర్గం, అనంతపురం డివిజన్ల పరిధిలోని 38 ప్రీమెట్రిక్ వసతి గృహాల్లో బాలురకు 3,103, బాలికలకు 1,364 సీట్లు ఖాళీ ఉన్నాయన్నారు. అలాగే, 17 పోస్ట్ మెట్రిక్ వసతి గృహాల్లో బాలురకు 622, బాలికలకు 547 సీట్లు ఉన్నాయని, అర్హులైన బీసీ, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఇప్పటికే పాఠశాల, కళాశాలలు పునఃప్రారంభమైన తరుణంలో హాస్టల్ వసతి కోసం రెన్యూవల్ చేసుకున్న విద్యార్థులు రెండు రోజుల్లో హాజరుకావాలని సూచించారు. రెన్యూవల్, కొత్త అడ్మిషన్ల కోసం అనంతపురం డివిజన్ విద్యార్థులు 96189 98334, తాడిపత్రి డివిజన్ విద్యార్థులు 94405 57253, కళ్యాణదుర్గం డివిజన్ విద్యార్థులు 9346558001 నంబర్లను సంప్రదించాలన్నారు.

సామాన్యులకు రెడ్‌సిగ్నల్

- ఇప్పటికే పలు ఎక్స్‌ప్రెస్ రైళ్ల రద్దు
- కరోనా సమయంలో రద్దైన ప్యాసింజర్ రైళ్లు నేటికీ పట్టాలెక్కని వైనం
- స్లీపర్ కోచ్‌లకూ కత్తెరేయడంతో సామాన్యుల ఇక్కట్లు
- సౌకర్యాలను మరచి.. ఆదాయంపైనే దృష్టి పెట్టిన రైల్వే!



అమరావతి ఎక్స్‌ప్రెస్‌లో బాత్‌రూమ్ కారిడార్ వద్ద ప్రయాణికుల అవస్థలు



స్లీపర్ బోగీలో ప్రయాణికుల దుస్థితి

గుంతకల్లు: సామాన్యులకు రైలు ప్రయాణం భారంగా మారింది. ఓ వైపు పలు ఎక్స్‌ప్రెస్ రైళ్లను రద్దు చేయడం.. మరోవైపు కరోనా సమయంలో రద్దు చేసిన ప్యాసింజర్ రైళ్లను పట్టాలెక్కించకపోవడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. దీనికి తోడు స్లీపర్ కోచ్‌ల సంఖ్యను కుదించడంతో రైలెక్కాలంటే జేబుకు చిల్లులు పడుతున్నాయి. వందేభారత్ లాంటి రైళ్లను అందుబాటులోకి తెచ్చారే తప్ప సాధారణ ప్రయాణికుల కష్టాలను మాత్రం పట్టించుకోవడం లేదన్న విమర్శలు సర్వత్రా వినిపిస్తున్నాయి.

ఎక్స్‌ప్రెస్ రైళ్ల రద్దుతో ఇబ్బందులు

- బెలగావి నుంచి భద్రాచలం రోడ్డుకు బెలగావి ఎక్స్‌ప్రెస్ రైళ్లు (07336/35) భద్రాచలానికి వెళ్లే భక్తులతో పాటు సికింద్రాబాద్‌కు రాకపోకలు సాగించే వ్యాపారులు, ఉద్యోగులు, విద్యార్థులకు ఎంతో ఉపయోగకరంగా ఉండేవి.
- హుబ్లీ– విజయవాడ – హుబ్లీ ఎక్స్‌ప్రెస్ రైలు విజయవాడకు వెళ్లడానికి ఎంతో అనువుగా ఉండేది. ఈ రైలు రోజూ హుబ్లీ జంక్షన్‌లో రాత్రి 8.30 గంటలకు బయలుదేరి గుంతకల్లు జంక్షన్‌కు అర్ధరాత్రి 12.30 గంటలకు వచ్చేది. ఇక్కడ నుంచి బయలుదేరి ఉదయం 11.00 గంటలకు విజయవాడకు చేరుకునేవారు. ఈ రైళ్లను రద్దు చేయడంతో గుంతకల్లు మీదుగా రాకపోకలు సాగించే ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

మచిలీపట్నం రైలును మళ్లించరా?

మచిలీపట్నం–ధర్మవరం మధ్య నడుస్తున్న ఎక్స్‌ప్రెస్ రైళ్లను గుంతకల్లు మీదుగా మళ్లించాలని విజయవాడకు వెళ్లే ప్రయాణికులు డిమాండ్ చేస్తున్నారు. ఎందుకంటే మచిలీపట్నం, ధర్మవరం రైల్వేస్టేషన్‌లో తిరుగు ప్రయాణంలో ఎక్కువ సమయం ఉండటంతో ఈ ఖాళీ టైమ్‌ను గుంతకల్లు మీదుగా మళ్లిస్తే ప్రయాణికులకు ఉపయోగకరంతో పాటు రైల్వేకు ఆదాయం లభిస్తుందంటున్నారు.

పట్టాలెక్కని పేదోడి రైళ్లు..

కరోనా సమయంలో రద్దు అయిన బెంగళూరు నుంచి విజయవాడకు వెళ్లే ప్యాసింజర్ రైళ్లు నేటికీ పట్టాలెక్కలేదు. ఈ రైళ్లు అటు విజయవాడ, ఇటు బెంగుళూరు రాకపోకలు సాగించే ప్రయాణికులకు తక్కువ చార్జీతో అందరికీ సౌకర్యంగా ఉండేది. ఈ ప్యాసింజర్ రైలుకు 13 బోగీలు ఉన్నప్పటికీ ఇందులో రెండు రిజర్వేషన్ స్లీపర్ కోచ్‌లు కూడా అందుబాటులో ఉండేవి. అలాగే గుంతకల్లు–ధర్మవరం మధ్య నడిచే ప్యాసింజర్ రైళ్లను కూడా రద్దు చేశారు. అయితే సాధారణ పరిస్థితులు నెలకొన్నా ఈ రైళ్లను మాత్రం పట్టాలెక్కించకపోవడంతో ప్రయాణికులు అవస్థలు పడుతున్నారు.

బాత్‌రూమ్‌ల వద్దే నిలబడి ప్రయాణం

గుంతకల్లు జంక్షన్ మీదుగా నడుస్తున్న పలు ఎక్స్‌ప్రెస్ రైళ్లకు స్లీపర్ బోగీలను కుదించి ఏసీ బోగీలను పెంచారు. దీంతో ఏసీ టికెట్ కొనుగోలు చేయలేని సామాన్య ప్రయాణికుడు స్లీపర్ టికెట్ కొన్నప్పటికీ అవి కూడా వందల సంఖ్యలో వెయిటింగ్ లిస్ట్‌లో ఉండడం, తీరా రైలు వచ్చే సమయానికి కూడా కన్ఫమ్ కాకపోవడంతో ఎలాగో అలా గమ్యానికి చేరుకోవాలనే ఉద్దేశంతో టీటీని బతిమాలి బాత్‌రూమ్‌ల వద్ద నిలబడి ప్రయాణించాల్సిన దుస్థితి నెలకొంది. ఇక జనరల్ బోగీల్లో ప్రయాణం మరీ దారుణంగా మారింది. ప్రయాణికులు కూర్చున్న సీటు నుంచి కదిలే పరిస్థితి ఉండదు.

స్లీపర్ బోగీలు కుదించిన రైళ్ల వివరాలు

- బెంగుళూరు నుంచి భువనేశ్వర్ వెళ్లే ప్రశాంతి ఎక్స్‌ప్రెస్ రైలు (18464) 12 స్లీపర్ క్లాస్ బోగీలు ఉండేవి. ప్రస్తుతం వాటిని ఆరుకు కుదించి, ఏసీ బోగీలను పెంచారు.
- ఎంజీఆర్ చెన్నై సెంట్రల్ నుంచి ఛత్రపతి శివాజీ టెర్మినల్ (ముంబై) (22160)కు రాకపోకలు సాగించే ఎక్స్‌ప్రెస్ ప్రస్తుతం కేవలం రెండు స్లీపర్, రెండు జనరల్ బోగీలు మినహా అన్ని ఏసీ కోచ్‌లే..
- వాస్కోడిగామా నుంచి జాసీదీ జంక్షన్ మధ్య నడిచే వీక్లీ ఎక్స్‌ప్రెస్ (17321) రైళ్లలో ఎక్కువగా కార్మికులు, కూలీలు ప్రయాణిస్తుంటారు. ఈ రైలు గతంలో 12 స్లీపర్ బోగీలతో రాకపోకలు సాగించేది. ప్రస్తుతం కేవలం రెండు స్లీపర్, రెండు జనరల్ బోగీలతో ప్రయాణిస్తోంది.
- బెంగళూరు నుంచి న్యూఢిల్లీ వెళ్లే కర్నాటక ఎక్స్‌ప్రెస్ (12627) రైళ్లకు దాదాపు 12 పైగా స్లీపర్ బోగీలు ఉండేవి. వాటిని ప్రస్తుతం 7 బోగీలకు కుదించారు.
- యశ్వంతపుర నుంచి గోరఖ్‌పూర్ వెళ్లే గోరఖ్‌పూర్ ఎక్స్‌ప్రెస్ (12592) రైలు కార్మికులు, కూలీలకు ఎంతో ఉపయోగకరంగా ఉండేది. ఈ రైలులో కేవలం 4 స్లీపర్ బోగీలు, 2 జనరల్ బోగీలు ఏర్పాటు చేశారు. ఇక అన్నీ ఫస్ట్ క్లాస్, సెకండ్ క్లాస్, థర్డ్ క్లాస్ ఏసీ బోగీలే.

ఆదాయంపైనే దృష్టి

ప్రతిరోజూ పైన తెలిపిన ఎక్స్‌ప్రెస్ రైళ్లలో గమ్యస్థానం నుంచి చివరి గమ్యస్థానాలకు చేరేలోపు దాదాపు 2,000 మంది సాధారణ ప్రయాణికులు టికెట్లు కొనుగోలు చేస్తున్నట్లు రైల్వే అధికారుల ద్వారా తెలిసింది. దీంతో జనరల్ బోగీలు కిక్కిరిసిపోయి ఉంటాయి. కేవలం రెండు జనరల్ బోగీలు ఉండడంతో బాత్‌రూమ్ కారిడార్ వద్దే పదుల సంఖ్యలో నిలబడి ప్రయాణాలు సాగిస్తున్నారు. ఈ బోగీల్లో ప్రయాణిస్తున్న వృద్ధులు, రోగులు, మహిళలు టాయిలెట్‌కి వెళ్లాలన్నా సాధ్యమయ్యే పని కాదు. ఇక ఫుట్‌బోర్డుపై ప్రయాణిస్తూ ప్రాణాలు కోల్పోతున్న సంఘటనలు రోజూ జరుగుతూనే ఉన్నాయి. అయినప్పటికీ రైల్వే శాఖ కేవలం ఆదాయం ఎలా పెంచుకోవాలనే తాపత్రయం తప్ప సామాన్యులకు సౌకర్యాలు మెరుగుపరచడంపై దృష్టి సారించడం లేదని ప్రయాణికులు విమర్శిస్తున్నారు. ప్యాసింజర్ రైళ్లను అందుబాటులోకి తెచ్చి స్లీపర్ క్లాస్ బోగీల సంఖ్య పెంచేలా చర్యలు తీసుకోవడం లేదని వాపోతున్నారు.

స్లీపర్ బోగీలు పెంచాలి



అసలే ఎక్కువ రద్దీగా ఉండే ప్రశాంతి ఎక్స్‌ప్రెస్ రైలులో స్లీపర్ బోగీలు తగ్గించడం ద్వారా వెయింటింగ్ లిస్ట్‌లో ఉన్న టిక్కెట్ కన్ఫమ్ కావడం లేదు. విజయవాడలో చదువుతున్న మా పిల్లల కోసం కనీసం నెలలో రెండు సార్లు వెళ్లాల్సి వస్తోంది. దీంతో ఈ రైలుకు ఎప్పుడు టికెట్ తీసుకోవాలని ప్రయత్నించినా దొరకడం లేదు.

– రఫీ, న్యాయవాది, గుంతకల్లు

ప్యాసింజర్ రైళ్లు పట్టాలెక్కించాలి



బెంగళూరు నుంచి విజయవాడకు గుంతకల్లు మీదుగా వెళ్లే ప్యాసింజర్ రైళ్లను తిరిగి ప్రవేశపెట్టాలి. విజయవాడ కనకదుర్గమ్మ దర్శనానికి వెళ్లే భక్తులతో పాటు విద్యార్థులకు ఎంతో ఉపయోగంగా ఉంటుంది. మాలాంటి సామాన్య ప్రయాణికులకు టికెట్ ధరలు కూడా అందుబాటులో ఉంటాయి. రైల్వే అధికారులు ఇప్పటికైనా చర్యలు తీసుకోవాలి.

– శాంతిరాణి, గుంతకల్లు

రైలు ప్రయాణాన్ని దూరం చేస్తున్నారు



కేంద్రంలోని మోదీ ప్రభుత్వం ప్రైవేటీకరణ వైపు మొగ్గు చూపుతూ సామాన్య ప్రజలకు రైలు ప్రయాణాన్ని దూరం చేస్తోంది. ఇందులో భాగంగానే ఎక్స్‌ప్రెస్ రైళ్లకు స్లీపర్ బోగీల స్థానంలో ఏసీ బోగీలను తీసుకొచ్చారు. దీంతో పాటు ప్యాసింజర్ రైళ్లను ఎక్కువ సంఖ్యలో రద్దు చేశారు. ఇప్పటికైనా సామాన్యులు ప్రయాణించే ప్యాసింజర్ రైళ్ల సంఖ్యను పెంచడంతో పాటు స్లీపర్ బోగీలను పునరుద్ధరించాలి.

– ఓబులు, సీఐయూటీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు

పండ్ల మొక్కల సాగుతో ఆర్థిక భరోసా



మాట్లాడుతున్న డ్వామా పీడీ వేణుగోపాల్ రెడ్డి

కూడేరు: పండ్ల మొక్కల సాగుతో ఆర్థిక భరోసా లభిస్తుందని డ్వామా పీడీ వేణుగోపాల్ రెడ్డి అన్నారు. గురువారం ఆయన కూడేరులోని ఎంపీడీఓ కార్యాలయంలో ఉపాధి పనుల కల్పనపై సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధి హామీ పథకం ద్వారా డ్రై ల్యాండ్ హార్టికల్చర్ కింద చేపట్టే పండ్ల మొక్కల సాగును సద్వినియోగం చేసుకోవాలన్నారు. చిన్న, సన్న కారు రైతులను ఆర్థికంగా బలోపేతం చేసేందుకు ప్రభుత్వం ఐదెకరాల వరకు చీనీ, దానిమ్మ, జామ, అల్లనేరుడు, నిమ్మ వంటి పండ్ల మొక్కలు సాగు చేసుకునేందుకు అవకాశం కల్పించిందన్నారు. లక్ష్యం మేరకు అర్హులైన రైతుల జాబితాను త్వరితగతిన తయారు చేసి పంపాలని ఆదేశించారు. జాబ్ కార్డు కల్గి పని అడిగే ప్రతి కూలీకి పని కల్పించాలన్నారు. కూలీలకు పనులు కల్పించే విషయంలో నిర్లక్ష్యం వహిస్తే శాఖాపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఫీల్డ్ అసిస్టెంట్లు లేని పంచాయతీలో సీనియర్ మేట్ల ద్వారా పనులు కల్పించి కూలీల సంఖ్యను పెంచాలని సూచించారు. దిన కూలీ రూ.300 వర్తించేలా చూడాలన్నారు. కార్యక్రమంలో ఏపీడీ విజయ లక్ష్మీ, ఎంపీడీఓ కార్యాలయ సూపరింటెండెంట్ నాగభూషణ రెడ్డి, తదితరులున్నారు.

రైతు బజార్‌లో రూ.42కే పచ్చిమిర్చి

అనంతపురం అగ్రికల్చర్: స్థానిక రైతుబజార్‌లో కిలో పచ్చిమిరప రూ. 42 ప్రకారం విక్రయించనున్నట్లు ఎస్టేట్ అధికారి ప్రతాప్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. బహిరంగ మార్కెట్‌లో పచ్చిమిర్చి ధర పెరగడంతో వినియోగదారులకు తక్కువ ధరకే అందుబాటులోకి తీసుకొచ్చినట్లు వివరించారు. మార్కెటింగ్ శాఖ ఏడీ ఆదేశాల మేరకు శుక్రవారం నుంచి కౌంటర్ మొదలవుతుందని తెలిపారు.

27 నుంచి అంతర్ జిల్లాల హాకీ పోటీలు

ధర్మవరం అర్బన్: పట్టణంలోని క్రీడామైదానంలో ఈనెల 27వ తేదీ నుంచి 30వ తేదీ వరకూ 14వ అంతర్ జిల్లాల సీనియర్ పురుషుల హాకీ పోటీలు నిర్వహిస్తున్నట్లు హాకీ ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యక్షుడు సూర్యప్రకాష్ ఒక ప్రకటనలో తెలిపారు. హాకీ ఆంధ్రప్రదేశ్ సౌజన్యంతో నిర్వహిస్తున్న ఈ పోటీల్లో 20 జిల్లా జట్లు పాల్గొంటాయన్నారు. ఈ పోటీల్లో ప్రతిభ కనబరచిన సుమారు 40 మందిని ఎంపిక చేసి వారికి కోచింగ్ క్యాంపు నిర్వహించి హాకీ ఆంధ్రప్రదేశ్ జట్టును ఎంపిక చేస్తామన్నారు. నవంబర్‌లో పూణేలో జరిగే జాతీయ హాకీ పోటీల్లో ఏపీకి వారు ప్రాతినిధ్యం వహిస్తారని చెప్పారు.

ఉదారంగా సాయమందించండి

- కేంద్ర బృందానికి రైతుల విజ్ఞప్తి



కణేకల్లు మండలం సొల్లాపురంలో పంట నష్ట వివరాలు తెలియజేస్తున్న రైతు మల్లికార్జున

కణేకల్లు/ఉరవకొండ: 'ఎన్నో ఆశలతో సాగు చేసిన పంటలు వర్షాభావంతో ఎండిపోయాయి. పంటలన్నీ దెబ్బతిన్నాయి. పశువులకు మేతగా ఉపయోగపడే జొన్న పంట, జొన్న సొప్ప (పశుగ్రాసం) కూడా లేకుండా పోయింది. పెట్టుబడులు కూడా దక్కలేదు. పరిస్థితి దయనీయంగా మారింది. మీరే ఉదారంగా ఆదుకోవాలి' అంటూ రైతులు తమ గోడు వెళ్లబోసుకొన్నారు. గత రబీలో నెలకొన్న కరువు పరిస్థితులను తెలుసుకునేందుకు జిల్లాకు విచ్చేసిన కేంద్ర బృందం గురువారం కణేకల్లు, ఉరవకొండ మండలాల్లో పర్యటించింది. కేంద్ర వ్యవసాయ మంత్రిత్వ శాఖ జాయింట్ సెక్రటరీ రితేష్ చౌహాన్ ఆధ్వర్యంలో బృంద సభ్యులు డాక్టర్ కె.పొన్నుస్వామి, సునీల్‌దుబే, చిన్మయ్ పుండ్లిక్‌రావ్ గోత్మారే, అశిష్‌పాండే,అరవింద్ కుమార్ సోనీలు కణేకల్లు మండలం సొల్లాపురం, ఉరవకొండ మండలం పెద్ద కొకుంట్లలో పంట నష్టానికి సంబంధించి ఫొటో ఎగ్జిబిషన్‌ను పరిశీలించారు. రైతులతో సమావేశాలు నిర్వహించారు.

నష్టాల్లో కూరుకుపోయాం..

సొల్లాపురంలో రైతులు వెంకటరెడ్డి, పుల్లన్న మాట్లాడుతూ ప్రతి ఏటా రబీలో పప్పుశనగ పంట సాగు చేస్తామని వర్షాలు సమృద్ధిగా కురిస్తే ఎకరానికి 6, 7 క్వింటాళ్ల వరకు దిగుబడి వచ్చేదన్నారు. గత రబీలో వర్షాలు లేక పంట పూర్తిగా దెబ్బతిందని ఆవేదన వ్యక్తం చేశారు. పెట్టుబడుల కోసం అప్పులు చేసిన తాము నష్టాల్లో కూరుకుపోయామన్నారు. మరో రైతు మల్లికార్జున మాట్లాడుతూ పశువులకు మేత కూడా కరువైందని ఆవేదన చెందారు. ఇన్‌పుట్ సబ్సిడీ మంజూరు చేసి ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు. మళ్లీ పంట సాగు చేయాలంటే తమ చేతిలో చిల్లిగవ్వ కూడా లేదని ఇన్‌పుట్ సబ్సిడీ సొమ్మును పెట్టుబడుల కోసం వినియోగించుకొంటామన్నారు. సర్పంచు జయరాం చౌదరి మాట్లాడుతూ హనుమాపురంలో తాగునీటి సమస్య తీవ్రంగా ఉందని, వేదవతి హగిరి నుంచి కొత్త పైప్‌లైన్ ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని కోరారు. కరువు పనులు చేసి రెండు నెలలైనా బిల్లులు పడటం లేదని, దీంతో కుటుంబ పోషణ ఇబ్బందిగా మారుతోందని పెద్దకొకుంట్లలో పలువురు ఉపాధి కూలీలు ఆవేదన వ్యక్తం చేశారు.

ప్రభుత్వానికి నివేదిక..

రైతుల సమస్యలపై కేంద్ర బృందం రాష్ట్ర ప్రభుత్వానికి నివేదిక సమర్పించనున్నట్లు జేసీ కేతన్‌గార్గ్ పేర్కొన్నారు. కేంద్రబృందం పర్యటన అనంతరం జేసీ విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. నివేదిక ఆధారంగా ప్రభుత్వం ఇన్‌పుట్ సబ్సిడీ లేదా ప్రధానమంత్రి ఫసల్ బీమా సత్వరమే మంజూరు చేసే అవకాశముంటుందన్నారు. కార్యక్రమంలో డీఏఓ ఉమామహేశ్వరమ్మ, వెటర్నరీ జేడీ సుబ్రమణ్యం, హార్టికల్చర్ డీడీ రఘునాథరెడ్డి, డ్వామా పీడీ వేణుగోపాల్‌రెడ్డి, కళ్యాణదుర్గం ఆర్డీఓ రాణీసుస్మిత, ఏపీఎంఐపీ ఏపీడీ ఫిరోజ్‌ఖాన్, డీడీఏ మద్దిలేటి, ఏడీఏ లక్ష్మానాయక్, ఏఓ శ్రవణ్ కుమార్, శ్రీనివాసులు, ఎ.శ్రవణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కొమ్మలు కొట్టమంటే..చెట్లు నరికారు!



చెట్లను తొలగిస్తున్న కార్మికులు

అనంతపురం ఎడ్యుకేషన్: సమగ్రశిక్ష కార్యాలయ ఆవరణం ఎప్పుడూ పచ్చని చెట్లతో కళకళలాడుతుండేది. ఏళ్లనాటి చెట్లు కావడంతో పెద్దపెద్ద కొమ్మలతో బాగా విరుచుకున్నాయి. ఇటీవల ఏపీసీగా బాధ్యతలు తీసుకున్న వైఖోమ్ నిదియాదేవి కార్యాలయానికి వచ్చిన సమయంలో ఆవరణం అపరిశుభ్రంగా ఉండడం, అక్కడక్కడా కొన్నిచెట్ల కొమ్మలు కార్యాలయం గోడలపైకి రావడాన్ని గమనించారు. దీంతో ఆవరణం మొత్తం శుభ్రం చేయించాలని, కార్యాలయం భవనాలపైకి వచ్చిన చెట్ల కొమ్మలను కూడా తొలగించాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. ఈ క్రమంలో జేసీబీలు పెట్టి మైదానాన్ని శుభ్రం చేయించిన అధికారులు.. చెట్ల కొమ్మలను తొలగించమని ఏపీసీ చెప్పిన మాటలను అదునుగా తీసుకుని ఏకంగా చెట్లను తొలగించుకోవాలంటూ ఓ కాంట్రాక్టర్‌కు ఒప్పందం ఇచ్చారు.చెట్లను తొలగించి వాటిని ఆయనే అమ్ముకునేందుకు అనుమతులు ఇవ్వడంతో పెద్దపెద్ద చెట్లను సైతం నేలమట్టం చేసి లారీలు, ట్రాక్టర్లతో బయటకు తరలించారు. కార్యాలయం భవనం మీదకు వాలిన కొమ్మలనే కాదు ఎవరికీ ఆటంకం లేని మైదానం, ఆఫీసు వెనుక వైపు ఉన్న పెద్ద పెద్ద చెట్లను తొలగించేశారు. కొమ్మలను కాకుండా మొదళ్ల వరకు చెట్లను తొలగించడం చూసి కార్యాలయ సిబ్బందే ముక్కున వేలేసుకుంటున్నారు. 'మేడం ఒకటి చెబితే.. ఇంజినీరింగ్ అధికారులు ఒకటి చేస్తున్నారంటూ' చర్చించుకుంటున్నారు. పచ్చదనం పరుచుకుని ఉన్న కార్యాలయ ఆవరణం ఇప్పుడు బోసిపోయిందంటూ వాపోతున్నారు. ఇదిలాఉండగా చెట్లను తొలగించిన కాంట్రాక్టర్‌తో కొంత మొత్తం చెల్లించేలా మాట్లాడుకున్నట్లు తెలిసింది. కలప తరలించి పెద్ద ఎత్తున సొమ్ము చేసుకున్నట్లు సమాచారం. కాగా, సమగ్ర శిక్ష కార్యాలయానికి కేటాయించిన స్థలం కూడా ఎస్సీ కార్పొరేషన్‌కు చెందింది. అప్పట్లో వారే చెట్ల పెంపకం చేపట్టారు. ఈరోజు ఇంత పెద్ద చెట్లను తొలగించేటప్పుడు సంబంధిత శాఖకు కూడా కనీస సమాచారం ఇవ్వలేదు. దీనిపై ఏపీసీ ఎలా స్పందిస్తారో చూడాలి.



ఏళ్లనాటి చెట్లను మొదళ్ల వరకు కొట్టేసిన దృశ్యం

విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించాలి



విద్యార్థులతో మాట్లాడుతున్న సమగ్రశిక్ష ఏపీసీ వైఖోమ్ నిదియాదేవి

వజ్రకరూరు: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించాలని సమగ్రశిక్ష అదనపు ప్రాజెక్టు సమన్వయకర్త వైఖోమ్ నిదియాదేవి అన్నారు. గురువారం వజ్రకరూరు కేవీ జెడ్పీ ఉన్నత పాఠశాలను ఆమె సందర్శించారు. తరగతి గదులను పరిశీలించి, విద్యార్థులతో మాట్లాడారు. కొద్దిసేపు ఉపాధ్యాయురాలిగా మారి విద్యార్థులకు గణితం బోధించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చక్కగా చదువుకుని ఉన్నత శిఖరాలు చేరుకోవాలన్నారు. ప్రతి విద్యార్థి లక్ష్యంతో చదవాలన్నారు. సమయాన్ని వృథా చేయరాదన్నారు. రోజూ పాఠశాలకు రావాలన్నారు. క్రమశిక్షణ అలవర్చుకోవాలని సూచించారు. పిల్లలను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దాలని ఉపాధ్యాయులను ఆదేశించారు. అనంతరం పాఠ్య పుస్తకాల స్టాక్ పాయింట్, ఎస్సీ బాలికల హాస్టల్‌ను ఆమె తనిఖీ చేశారు. హాస్టల్‌లో విద్యార్థులను చక్కగా చూసుకోవాలని, మెనూ పక్కాగా అమలు చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ విజయలలిత, ఎంఈఓ తిమ్మప్ప, వజ్రకరూరు సర్పంచు మోనాలిసా, ఏఎస్‌డబ్ల్యూఓ రామ్మోహన్, హాస్టల్ వార్డెన్ సుగుణమ్మ, హెచ్‌ఎం స్వర్ణలత, గ్రామ కార్యదర్శి శ్రీధర్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

లెనిన్ సమాధిని సందర్శించిన మేయర్ వసీం


లెనిన్ సమాధి వద్ద మేయర్ వసీం

అనంతపురం కార్పొరేషన్: మాస్కోలోని రెడ్ స్క్వేర్లో ఉన్న లెనిన్ సమాధిని నగర మేయర్ వసీం గురువారం (ఆ ప్రాంతంలో బుధవారం) సందర్శించారు. ఈ నెల 21న రష్యాలోని కజాన్‌లో జరిగే బ్రిక్స్ దేశాల మేయర్ల సమావేశానికి ఆహ్వానం అందుకున్న ఆయన అక్కడకు వెళ్లిన విషయం విదితమే. ఈ క్రమంలో చరిత్రాత్మక ప్రదేశమైన లెనిన్ సమాధిని సందర్శించి, నివాళులర్పించారు.

బీసీ విద్యార్థినులకు ప్రీ మెట్రిక్ హాస్టల్

కళ్యాణదుర్గం: ఈ విద్యా సంవత్సరం నుంచి కళ్యాణదుర్గంలో బీసీ బాలికల కోసం ప్రీ మెట్రిక్ వసతి గృహాన్ని అందుబాటులోకి తీసుకువచ్చినట్లు ఏబీసీడబ్ల్యూ అధికారి గంగాద్రి తెలిపారు. ఈ మేరకు గురువారం ఓ ప్రకటన విడుదల చేశారు. బ్రహ్మసముద్రం రోడ్డులో ఉన్న ప్రభుత్వ సమీకృత బాలికల వసతి సముదాయంలో ఏర్పాటు చేసిన ప్రీ మెట్రిక్ హాస్టల్‌లో ప్రవేశాలకు దరఖాస్తులు స్వీకరిస్తున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో 3 నుంచి 10వ తరగతి వరకూ చదువుతున్న బాలికలు మాత్రమే అర్హులు. మొత్తం 150 సీట్లు ఉన్నాయి. ప్రభుత్వ నిబంధనల మేరకు సీట్ల భర్తీ ఉంటుంది. బీసీ బాలికలకు 76 శాతం, ఎస్సీ బాలికలకు 15 శాతం, ఎస్టీ బాలికలకు 6 శాతం, ఈబీసీ, ఇతరులకు మిగిలిన సీట్లు కేటాయిస్తారు. అడ్మిషన్ల కోసం వసతి గృహ సంక్షేమాధికారి పద్మావతి (80086 71755)ని సంప్రదించవచ్చు.

‘ఖజానా’లో సీతయ్య

- అంతా తానేనంటున్న ద్వితీయ శ్రేణి అధికారి
- ఎవరి మాట వినని వైనం
- ఎస్టీఓ స్థాయి అధికారులంటే చులకన
- రోజుల తరబడి బిల్లులు పెండింగ్

అనంతపురం అర్బన్: జిల్లా ఖజానా శాఖలో ఓ ద్వితీయ శ్రేణి అధికారి ఎవరి మాట వినని సీతయ్యలా మారాడు. ఆయన తీరుపై ఆ శాఖ ఉద్యోగులే విమర్శలు గుప్పిస్తున్నారు. ఎస్టీఓ స్థాయి అధికారులంటే ఆయనకు చాలా చులకన. ఉన్నతాధికారి మంచితనాన్ని... ఆమె వద్ద తనకున్న చనువును అడ్డుపెట్టుకుని ఖజానా శాఖలో అంతా తానై వ్యవహరిస్తున్నట్లు ఆరోపణలు వెల్లువెత్తాయి.

రోజుల తరబడి పేరుకుపోతున్న బిల్లులు

ప్రధానంగా బిల్లుల మంజూరు విషయంలో సదరు ద్వితీయ శ్రేణి అధికారి తీవ్ర జాప్యం చేస్తూ రోజుల తరబడి పెండింగ్‌లో ఉంచుతున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. వివిధ పద్దులకు సంబంధించిన బిల్లులు కింది స్థాయి అధికాల నుంచి అందిన వెంటనే ద్వితీయ శ్రేణి అధికారులు పరిశీలించి అన్ని సక్రమంగా ఉంటే వెంటనే ఆమోదించాల్సి ఉంటుంది. ఈ ప్రక్రియ మూడు నాలుగు రోజుల్లోపు పూర్తి చేయాలనే నిబంధన ఉంది. అయితే బిల్లులను సకాలంలో పాస్ చేయకుండా రోజుల తరబడి పెండింగ్‌లో ఉంచడంతో కింది స్థాయి అధికారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. బిల్లులు పాస్ చేయించేందుకు సంబంధిత సీటు అధికారే స్వయంగా వెళ్లి మాట్లాడాల్సిన పరిస్థితి నెలకొందని పలువురు వాపోతున్నారు. సీనియర్ అధికారలకూ సైతం కనీస గౌరవమివ్వకుండా వ్యవహరిస్తున్న ఆ అధికారి తీరుపై ఖజానా శాఖ ఉద్యోగులందరూ అసహనం వ్యక్తం చేస్తున్నారు.



రాష్ట్రస్థాయి దృష్టికి తీసుకెళ్లేందుకు...

ఖజానాశాఖ ఉన్నతాధికారి వద్ద తనకున్న చనువును ఓ ద్వితీయ శ్రేణి అధికారి ఆసరాగా చేసుకుని కార్యాలయంలో అంతా తానై వ్యవహరిస్తున్నారని పలువురు ఉద్యోగులు బహిరంగంగానే పేర్కొంటున్నారు. ఈ క్రమంలో ఆ అధికారి పనితీరుపై ఉన్నతాధికారికి ఫిర్యాదు చేసినా ప్రయోజనం లేకుండా పోతోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీంతో సదరు ద్వితీయ శ్రేణి అధికారి వ్యవహారశైలిని రాష్ట్ర స్థాయి అధికారుల దృష్టికి తీసుకెళ్లేందుకు సిద్ధమవుతున్నట్లు తెలిసింది.

పెండింగ్ బిల్లులపై సమీక్షిస్తున్నా



బిల్లుల పెండింగ్‌పై సంబంధిత అధికారులతో సమీక్షిస్తున్నాను. పెండింగ్‌లో ఉన్న వాటిలో ఇప్పటికే కొన్ని బిల్లులు క్లియర్ చేయించాను. మిగిలిన వాటిని కూడా వెంటనే పాస్ చేయాలని ఆదేశాలిచ్చాను. బిల్లులు పెండింగ్‌లో పెట్టకుండా నిర్దేశించిన వ్యవధిలోపు క్లియర్ చేయాలని స్పష్టమైన ఆదేశాలిచ్చాను.

– సరళ విజయకుమారి, డిప్యూటీ డైరెక్టర్, ఖజానా శాఖ

ఎన్‌సీసీ శిక్షణతో ఉన్నత భవిష్యత్తు

- క్యాంప్ కమాండర్ కెప్టెన్ కల్నల్ కులకర్ణ


మాట్లాడుతున్న కెప్టెన్ కల్నల్ కులకర్ణ

కూడేరు: ఎన్‌సీసీ శిక్షణతో ఉన్నత భవిష్యత్తు ఉంటుందని క్యాడెట్లకు సీఏటీసీ-1 ఎన్‌సీసీ క్యాంప్ కమాండర్ కెప్టెన్ కల్నల్ కులకర్ణ సూచించారు. గురువారం కూడేరు మండల పరిధిలోని బ్రాహ్మణపల్లి వద్ద ఉన్న ఎన్‌సీసీ నగర్‌లో సీఏటీసీ-1 ఎన్‌సీసీ శిక్షణా తరగతులు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో క్యాంప్ కమాండర్ ఎన్‌సీసీ క్యాడెట్లనుద్దేశించి మాట్లాడారు. 10 రోజుల పాటు ఈ శిక్షణా తరగతులు కొనసాగుతాయన్నారు. ఇక్కడ నేర్పించే ప్రతి అంశం జీవితంలో ఎదుగుదలకు ఎంతగానో దోహదపడుతుందన్నారు. కాబట్టి క్యాడెట్లు శిక్షణా తరగతులను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సుబేదార్ సుల్దార్‌సింగ్, ఎన్‌సీసీ అధికారులు, కర్నూలు, నద్యాల, అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాలకు చెందిన 560 మంది క్యాడెట్లు పాల్గొన్నారు.

జీజీహెచ్ రక్తనిధిలో ఇష్టారాజ్యం

- సాయంత్రం 4 దాటితే సేవలు నిల్
- అత్యవసర సమయంలో రోగులకు అందని రక్తం

అనంతపురం మెడికల్: ప్రభుత్వ సర్వజనాస్పత్రి (జీజీహెచ్)లోని రక్త నిధి విభాగం వైద్యులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. రౌండ్ ద క్లాక్ ఉండాల్సిన వైద్యులు సాయంత్రం4 గంటలైతే చాలు కంటికి సైతం కనిపించరు. ఆ తర్వాత మరుసటి రోజు 9 గంటల వరకూ రక్త నిధి సేవలు అందుబాటులో లేకపోవడంతో అత్యవసర సమయంలో రక్తం కోసం రోగుల సంబంధీకులు నానా పాట్లు పడుతున్నారు.

వైద్యుల పాత్రే కీలకం

ప్రభుత్వ సర్వజనాస్పత్రిలోని రక్తనిధి కేంద్రం నిర్వహణ బాధ్యతను వైద్య కళాశాలలోని పెథాలజీ విభాగం చూస్తోంది. ప్రొఫెసర్, అసోసియేట్, ఇద్దరు అసిస్టెంట్ ప్రొఫెసర్లు ఇక్కడ సేవలందిస్తున్నారు. రోగులకు వివిధ రకాల గ్రూపుల రక్తం అందించడానికి క్రాస్ మ్యాచింగ్ నిర్ధారణ చాలా కీలకం. రోగులకు కచ్చితంగా మ్యాచ్ అయ్యే రక్తాన్ని పెథాలజిస్టులు నిర్ధారణ చేస్తారు. దీని ఆధారంగా రోగులకు రక్తం ఎక్కిస్తారు. ఆస్పత్రిలో గైనిక్, లేబర్, ఆంటినేటల్, మెడిసిన్, ఆర్థో, సర్జరీ తదితర విభాగాల్లో అడ్మిషన్‌లో ఉన్న రోగులకు రక్తం అవసరం చాలా ఉంటుంది. రోజూ సర్వజనాస్పత్రిలోని రక్తనిధి కేంద్రం నుంచి వివిధ విభాగాలకు 40 యూనిట్ల రక్తాన్ని అందిస్తున్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకూ సేవలు సాఫీగా జరుగుతాయి. సాయంత్రం నుంచి మరుసటి రోజు వరకు వైద్యులు అందుబాటులో ఉండరు. ఆ సమయంలో విధుల్లో ఉన్న గైనకాలజిస్టులే క్రాచ్ మ్యాచింగ్ చూసుకోవాల్సి వస్తోంది. రోజూ 25 నుంచి 30 ప్రసవాలు జరిగితే.. అందులో 5 నుంచి 8 వరకు సిజేరియన్లు ఉంటాయి. ఇంతటి పని ఒత్తిడిలో గైనకాలజిస్టులు రక్తనిధి కేంద్రానికి వెళ్లి క్రాచ్ మ్యాచింగ్ చూసుకోవాల్సి వస్తోంది. రాత్రి వేళల్లో అత్యవసరమైన పరిస్థితిలో రక్తం అందక రోగుల కుటుంబీకులు నానా అగచాట్లు పడుతుంటారు.


సర్వజనాస్పత్రిలోని బ్లడ్ బ్యాంక్‌లో రక్తదానం చేస్తున్న యువకుడు

కలెక్టర్ స్పందించేనా?

రాత్రి వేళల్లోనూ రక్తనిధిలో వైద్యులు అందుబాటులో ఉండాలని, వీలైతే క్యాజువాలిటీ మెడికల్ ఆఫీసర్లు క్రాచ్ మ్యాచింగ్ చూడాలని గతంలో ప్రభుత్వ సర్వజనాస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కేఎస్ఎస్ వెంకటేశ్వరరావు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. అయితే వివిధ సాకులు చూపుతూ క్యాజువాలిటీ మెడికల్ ఆఫీసర్లు ఆ విధుల నుంచి తప్పించుకున్నారు. దీంతో రక్త నిధి నిర్వహణ ఇష్టారాజ్యంగా కొనసాగుతోంది. జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్ స్పందించి జీజీహెచ్‌లోని రక్తనిధి సేవలను గాడిలో పెట్టాల్సిన అవసరం ఎంతైనా ఉందని పలువురు కోరుతున్నారు.

పాలనలో ‘రెవెన్యూ’ది పెద్దన్న పాత్ర

- కలెక్టర్ వినోద్‌కుమార్

అనంతపురం అర్బన్: పరిపాలనలో రెవెన్యూ శాఖ పెద్దన్న పాత్ర పోషిస్తే... రెవెన్యూ ఉద్యోగులు వెన్నెముక లాంటివారని కలెక్టర్ వి.వినోద్‌కుమార్ అన్నారు. గురువారం రాత్రి కలెక్టరేట్‌లోని రెవెన్యూ భవన్‌లో రెవెన్యూ డే వేడుకలు నిర్వహించారు. డీఆర్ఓ జి.రామకృష్ణారెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో కలెక్టర్‌తో పాటు జాయింట్ కలెక్టర్ కేతన్‌గార్గ్, జెడ్పీ సీఈఓ వైఖోమ్ నిదియాదేవి, నగర పాలక సంస్థ కమిషనర్ మేఘ స్వరూప్ ముఖ్యఅతిథిలుగా హాజరయ్యారు. కలెక్టర్ మాట్లాడుతూ అన్ని శాఖలను సమన్వయం చేసుకుంటూ పాలన సమర్థవంతంగా నిర్వహించడంలో రెవెన్యూ శాఖ కీలకమన్నారు. అనంతరం డిప్యూటీ కలెక్టర్లు ఆనంద్, శిరీష, ఆర్డీఓలు గ్రంధి వెంకటేష్, రాణి సుస్మిత, శ్రీనివాసులురెడ్డి, విశ్రాంత రెవెన్యూ ఉద్యోగులను కలెక్టర్ సన్మానించారు.


డిప్యూటీ కలెక్టర్ శిరీషను సన్మానిస్తున్న కలెక్టర్ వినోద్‌కుమార్, చిత్రంలో జేసీ కేతన్‌గార్గ్

విద్యుదాఘాతంతో రైతు మృతి


మృతుడు చంద్రమౌళి

నార్పల: విద్యుత్ షాక్‌కు గురై ఓ రైతు మృతి చెందాడు. పోలీసులు తెలిపిన మేరకు... నార్పల మండలం బొందలవాడ గ్రామానికి చెందిన చంద్రమౌళి (48) గురువారం ఉదయం తన పొలంలోని అరటి చెట్లకు నీళ్లు పెట్టేందుకు విద్యుత్ మోటార్ ఆన్ చేసేందుకు స్టార్టర్ పెట్టెను తెరుస్తుండగా షాక్‌కు గురై అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడికి భార్య పద్మావతి ఉంది. సంతానం లేదు. తండ్రి వన్నూరప్ప ఫిర్యాదు మేరకు ఎస్ఐ రాజశేఖర్‌రెడ్డి కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

హత్య కేసులో నిందితుల అరెస్ట్

కళ్యాణదుర్గం రూరల్: వృద్ధుడి హత్యకేసులో నిందితులను అరెస్ట్ చేసినట్లు కళ్యాణదుర్గం డీఎస్పీ బి.శ్రీనివాసులు తెలిపారు. గురువారం ఉదయం స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నిందితుల వివరాలను సీఐ హరినాథ్‌తో కలసి ఆయన వెల్లడించారు. ఈ నెల 14న కళ్యాణదుర్గంలోని గాంధీ చౌక్ వద్ద స్థానిక వృద్ధుడు ఉమాపతి తీవ్రంగా గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. పోస్టుమార్టం నివేదికలో వృద్ధుడిపై దాడి జరిగినట్లుగా నిర్ధారణ కావడంతో ఆ దిశగా పోలీసులు దర్యాప్తు చేపట్టారు. ఈ క్రమంలో స్థానికులు సాయికుమార్, షేక్ లాలు, చిన్న, బోయ గాంధీ, షేక్ సర్దార్ వలి ప్రవర్తన అనుమానాస్పదంగా కనిపించడంతో వారిని అదుపులోకి తీసుకుని తమదైన శైలిలో విచారణ చేయడంతో వాస్తవం బహిర్గతమైంది. ఈ నెల 14న గాంధీ చౌక్ వద్ద తమకు తారస పడిన ఉమాపతితో అనవసరంగా గొడవపడిన తాము బండరాళ్లతో దాడి చేసినట్లుగా నిందితులు అంగీకరించారు. దాడిలో మృతి చెందిన ఉమాపతికి తమకు మధ్య ఎలాంటి పాత కక్షలు లేవని వారు పేర్కొన్నారు. కేవలం క్షణికావేశంలోనే జరిగిందని వివరించారు. దీంతో నిందితులపై కేసు నమోదు చేసి గురువారం రిమాండ్‌కు తరలించారు.


వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ శ్రీనివాసులు

కుటుంబసభ్యులకు బాలుడి అప్పగింత


పోలీసుస్టేషన్‌లో తండ్రి వద్దకు చేరిన కార్తీక్

ఉవరకొండ: ఇంటి నుంచి తప్పిపోయిన బాలుడిని పోలీసులు గుర్తించి సురక్షితంగా తల్లిదండ్రుల చెంతకు చేర్చారు. వివరాలు... ఉరవకొండ ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో ప్రయాణికులకు బుధవారం సాయంత్రం ఓ పదేళ్ల వయసున్న బాలుడు ఏడుస్తూ కనిపించాడు. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడకు చేరుకుని బాలుడిని తీసుకుని స్టేషన్‌కు చేరుకున్నారు. సీఐ సురేష్‌బాబు, ఎస్ఐ రాఘవేంద్రప్ప, హెడ్ కానిస్టేబుల్ కులశేఖర్‌రెడ్డి తదితరులు బాలుడి వివరాలు తెలుసుకునేందుకు ప్రయత్నించినా ఫలితం లేకపోయింది. అప్పటికే చీకటి పడడంతో రాత్రికి అక్కడే బాలుడిని ఉంచుకుని భోజన సదుపాయాలు కల్పించారు. అనంతరం గురువారం ఉదయం స్థానిక ఆపద్బంధావ ట్రస్ట్ సభ్యుల సహకారంతో బాలుడి ఆచూకీ తెలుసుకున్నారు. ఉరవకొండలోని ఇందిరానగర్‌కు చెందిన ఆనంద్ కుమారుడు కార్తీక్‌గా నిర్ధారించుకుని కుటుంబసభ్యులకు సమాచారం ఇవ్వడంతో తండ్రి స్టేషన్‌కు వచ్చి కుమారుడిని అక్కున చేర్చుకున్నాడు. కౌన్సిలింగ్ అనంతరం కుటుంబ సభ్యులకు బాలుడిని అప్పగించారు.


యోగాతో సంపూర్ణ ఆరోగ్యం


ర్యాలీని ప్రారంభిస్తున్న ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ, డిప్యూటీ మేయర్ కోగటం

అనంతపురం కల్చరల్: యోగాతో సంపూర్ణ ఆరోగ్యం సిద్ధిస్తుందని పలువురు వక్తలన్నారు. అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా వివిధ యోగా సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో గురువారం అనంతపురంలో పెద్ద ఎత్తున యోగాపై అవగాహన కల్పిస్తూ ర్యాలీ చేపట్టారు. ముఖ్య అతిథులుగా విచ్చేసిన అనంతపురం ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ, డిప్యూటీ మేయర్ కోగటం విజయభాస్కరరెడ్డి తదితరులు యోగా విశిష్టతను తెలియజేశారు. వివేకానంద యోగకేంద్ర నిర్వాహకులు మెశవాయి రాజశేఖరరెడ్డి, ఆయుష్ శాఖ డాక్టర్ తిరుపతినాయుడు, డాక్టర్ రామకుమార్, బ్రహ్మకుమారీల జిల్లా ఇన్‌చార్జి సిస్టర్ శారద, ఆర్మ్‌డ్ రిజర్వ్ పోలీసు శాఖ డీఎస్పీ మునిరాజ తదితరులు నిత్యజీవితంలో ఒత్తిడి తగ్గించే యోగా ప్రాముఖ్యతను మాట్లాడారు. ఎన్నో మానసిక , శారీరక రుగ్మతలను పారద్రోలేందుకు యోగా దివ్య ఔషధంగా మారిందన్నారు. శుక్రవారం ఉదయం స్థానిక పెరేడ్ మైదానంలో జరిగే అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో డీపీఆర్వో గురుస్వామి, ఆచార్య సుధాకరబాబు, డాక్టర్ రఫీక్, యోగా గురువులు కృష్ణవేణి, ఆంజనేయులు, దివాకర్, మారుతీప్రసాద్, ఎస్ఎస్ఎస్ రాష్ట్రపతి అవార్డు గ్రహీత జయమారుతి తదితరులు పాల్గొన్నారు.

ప్రజారోగ్యానికి ప్రధాన శత్రువులు దోమలే

- జిల్లా మలేరియా అధికారి ఓబులు


రికార్డులు పరిశీలిస్తున్న డాక్టర్ ఓబులు

వజ్రకరూరు: ప్రజారోగ్యానికి ప్రధాన శత్రువులు దోమలేనని, దోమకాటుతో మలేరియా, బోద, డెంగీ, మెదడువాపు, చికున్‌గున్యా తదితర వ్యాధులు వ్యాపిస్తాయని జిల్లా మలేరియా అధికారి డాక్టర్ ఓబులు అన్నారు. వజ్రకరూరు మండలం కొనకొండ్లలోని సీహెచ్‌సీని గురువారం ఆయన తనిఖీ చేశారు. రోజువారీ ఓపీపై ఆరా తీశారు. ల్యాబ్‌లోని రికార్డులు పరిశీలించారు. దోమకాటు వ్యాధులపై ప్రజలను చైతన్య పరచాలని సిబ్బందికి సూచించారు. అనంతరం మలేరియా వ్యతిరేకమాస ఉత్సవాలపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో వైద్యులు సర్దార్‌వలి, తేజాప్రతిమ, జిల్లా సహాయ మలేరియా అధికారి సత్యనారాయణ, ఎంపీహెచ్ఈఓ గురుప్రసాద్, మలేరియా సబ్ యూనిట్ అధికారి కోదండరామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పెళ్లి కోసం దాచిన నగదు, నగల అపహరణ

కళ్యాణదుర్గం రూరల్: శుభకార్యం నిమిత్తం దాచిన నగదు, బంగారు నగలను దుండగులు అపహరించుకెళ్లారు. పోలీసులు తెలిపిన మేరకు... కళ్యాణదుర్గం మండలం నారాయణపురం గ్రామానికి చెందిన ఆదినారాయణ, గోవిందమ్మ దంపతులకు ఇద్దరు కుమారులు ఉన్నారు. బెంగళూరులో పనిచేస్తున్న పెద్ద కుమారుడికి వివాహం నిశ్చయమైంది. ఈ క్రమంలో పెళ్లి ఖర్చుల కోసమని రూ.2 లక్షలకు పైగా నగదును బీరువాలో దాచారు. బుధవారం రాత్రి ఇంట్లో ఉక్కపోతగా ఉండడంతో కుటుంబసభ్యులతో కలసి ఆదినారాయణ ఇంటి మేడపైకెక్కి నిద్రించాడు. అర్ధరాత్రి ఇంటికి వేసిన తాళం పగులగొట్టి లోపలకు ప్రవేశించిన దుండగులు బీరువాను ధ్వంసం చేసి, రూ.2,62,500 నగదు, జత కమ్మలు, బంగారు గొలుసు అపహరించుకెళ్లారు. గురువారం ఉదయం నిద్రలేచిన ఆదినారాయణ ఇంటి వాకిలి తెరిచి ఉండడం గమనించి లోపలికెళ్లి చూశాడు. బీరువాలోని వస్తువులన్నీ చెల్లాచెదురుగా పడి ఉండడంతో చోరీ జరిగినట్లు నిర్ధారించుకున్నాడు. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కళ్యాణదుర్గం రూరల్ పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.


చెల్లాచెదురైన బీరువాలోని వస్తువులు

చిన్నారి అదృశ్యం


పావని

నార్పల: మండల కేంద్రంలోని కొత్త బస్టాండ్ కాలనీకి చెందిన గణేష్ కుమార్తె ఆరేళ్ల వయసున్న పావని గురువారం నుంచి కనిపించడం లేదు. ఇంటి పరిసరాల్లో ఆడుకుంటున్న తన కుమార్తె కనిపించడం లేదంటూ తండ్రి చేసిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు ఎస్ఐ రాజశేఖరరెడ్డి తెలిపారు. చిన్నారి ఆచూకీ తెలిస్తే 94901 06853కు సమాచారం ఇవ్వాలని కోరారు.

ఎస్సీ బాలుర వసతి గృహం పరిశీలన

శింగనమల: మండలంలోని తరిమెల గ్రామంలో ఉన్న ఎస్సీ బాలుర వసతి గృహాన్ని ఎంపీడీఓ బీవీ రమణ గురువారం తనిఖీ చేశారు. మౌలిక వసతులు పరిశీలించారు. విద్యార్థుల సంఖ్యను అడిగి తెలుసుకున్నారు. ఖాళీగా ఉన్న సీట్లకు విద్యార్థులను చేర్చుకోవాలని సూచించారు. నాణ్యమైన భోజనాన్ని అందించాలని ఆదేశించారు. భవనాల మరమ్మతుకు నివేదిక సిద్ధం చేసి కలెక్టర్‌కు అందజేస్తామన్నారు. ఈ సందర్భంగా ఆయన వెంట పంచాయతీ కార్యదర్శి గోవిందరాజులు ఉన్నారు.

వృద్ధురాలి దారుణ హత్య


హతురాలు చంద్రక్క

పావగడ: స్థానిక పోలీస్ స్టేషన్ పరిధిలో ఓ వృద్ధురాలు దారుణ హత్యకు గురైంది. పోలీసులు తెలిపిన మేరకు... మడకశిర మండలం ఎల్లోటి గ్రామానికి చెందిన వడ్డె చంద్రక్క (60) గురువారం ఉదయం 7.30 గంటలకు అదే గ్రామంలో వేరు కాపురం ఉంటున్న కుమారుడు ఆంజనేయులు ఇంటికి వెళ్లింది. ఆ సమయంలో కుమారుడు, కోడలు రాధ ఇంట్లో లేకపోవడంతో మనువరాలిని పలకరించి, తాను వేప విత్తనాలు ఏరుకుని వస్తానని తెలిపి, గ్రామ శివారులో కర్ణాటకలోని పావగడ తాలూకా మాచురాజనహళ్లి గ్రామంలోని నీలగిరి వనానికి చేరుకుంది. కాసేపటి తర్వాత ఆంజనేయులుకు ఎల్లోటి గ్రామానికి చెందిన హరిజన గోవిందప్ప ఫోన్ చేసి నీలగిరి వనంలో గుర్తు తెలియని వ్యక్తులు చంద్రక్క గొంతు కోసి హతమార్చారంటూ తెలిపాడు. దీంతో ఆంజనేయులు అక్కడకు చేరుకుని రక్తపుమడుగులో పడి ఉన్న తల్లి మృతదేహాన్ని చూసి బోరున విలపించాడు. అదే సమయంలో మడకశిర (ఆంధ్ర), పావగడ (కర్ణాటక) పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించారు. ఎవరో పదునైన కత్తితో ఆమె గొంతు కోసి హతమార్చినట్లుగా నిర్ధారించారు. ఘటనకు సంబంధించి కర్ణాటక పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

భల్లూకం.. భయం భయం

రాయదుర్గం టౌన్/కళ్యాణదుర్గం రూరల్: రాయదుర్గం పట్టణంలోని మొలకాల్మూరు రోడ్డు చెక్‌పోస్టు అభయాంజనేయస్వామి గుడి సమీపంలో గురువారం మధ్యాహ్నం ఎలుగుబంటి సంచారం కలకలం రేపింది. ప్రధాన రహదారికి పక్కనే భల్లూకం కనిపించడంతో ప్రజలు భయాందోళనలకు గురయ్యారు. ఈ ప్రాంతంలో కొండ ప్రాంతం నుంచి తరుచూ ఎలుగుబంటి సంచరిస్తున్నట్లు పైతోట వాసులు తెలిపారు. ఈ సారి ఏకంగా నివాసాలకు సమీపంలోకి రావడంతో బెంబేలెత్తారు. కుక్కలు వెంటపడడంతో కొండపైకి పారిపోయిందన్నారు. ఫారెస్ట్ అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని కోరారు.

- కళ్యాణదుర్గం పట్టణ సమీపంలో కన్నేపల్లి రోడ్డు వద్ద కూడా ఓ ఎలుగు బంటి సంచారం భయభ్రాంతులకు గురి చేసింది. గురువారం ఉదయం అటుగా వాకింగ్‌కు వెళ్లిన పలువురికి భల్లూకం తారసపడింది. గట్టిగా అరవడంతో పక్కనే ఉన్న కొండపొదల్లోకి పారిపోయింది. సమాచారం అందుకున్న అటవీ శాఖ అధికారులు ఆ ప్రాంతంలో గాలింపు చర్యలు చేపట్టారు.


రాయదుర్గం పట్టణం మొలకాల్మూరు రోడ్డు చెక్ పోస్టు వద్ద ప్రధాన రహదారి పక్కనే సంచరిస్తున్న ఎలుగుబంటి

క్లుప్తంగా

బీసీజీ వ్యాక్సిన్‌తో క్షయ నివారణ



చిన్నమొగలయపల్లిలో వృద్ధుడికి బీసీజీ టీకా వేస్తున్న దృశ్యం

చెన్నేకొత్తపల్లి: 60 సంవత్సరాలు పైబడిన వారందరూ బీసీజీ టీకాను తప్పనిసరిగా వేయించుకోవాలి. బీసీజీ వ్యాక్సిన్‌తో క్షయ వ్యాధిని నివారించొచ్చని ఎన్ఎస్ గేట్ పీహెచ్‌సీ వైద్యులు డాక్టర్ ఉదయ్, డాక్టర్ రవినాయక్ సూచించారు. గురువారం మండల వ్యాప్తంగా అన్ని గ్రామాల్లో బీసీజీ వ్యాక్సినేషన్ చేపట్టారు. చెన్నేకొత్తపల్లిలో జరుగుతున్న బీసీజీ వ్యాక్సినేషన్‌ను ఎన్ఎస్ గేట్ పీహెచ్‌సీ వైద్యుడు రవినాయక్ పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ వ్యాక్సిన్‌ను వృద్ధులు తప్పనిసరిగా వేయించుకోవాలన్నారు. క్షయ, బీపీ, షుగర్ వ్యాధులు దరిచేరే అవకాశాలు తక్కువగా ఉంటాయన్నారు. క్షయ వ్యాధి బారిన పడకుండా ఉండేందుకు ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు. కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ విష్ణువర్ధన్, వైద్య సిబ్బంది రమాదేవి, ఎంఎల్‌హెచ్‌పీలు మౌనిక, వనజ, సూపర్‌వైజర్ రామలక్ష్మి, ఏఎన్ఎం సుశీల, ఆశావర్కర్ రాధమ్మ తదితరులు పాల్గొన్నారు.

వసతి గృహాల్లో ప్రవేశాలకు దరఖాస్తుల స్వీకరణ

చెన్నేకొత్తపల్లి: మండల కేంద్రంలో ఉన్న సాంఘిక సంక్షేమ బాలుర, బాలికల, వెనుకబడిన తరగతుల బాలుర వసతి గృహాల్లో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఆయా వసతి గృహాల అధికారులు శ్యామల, శంకర్, నారాయణ స్వామి గురువారం వేర్వేరు ప్రకటనల్లో తెలిపారు. 3వ తరగతి నుంచి 10వ తరగతి వరకు చదువుతున్న విద్యార్థులు వసతి గృహాల్లో చేరేందుకు అర్హులని పేర్కొన్నారు. దరఖాస్తుకు విద్యార్థి, తల్లిదండ్రుల ఆధార్ కార్డులు, విద్యార్థి టీసీ, 4 పాస్‌ఫోటోలు, తల్లి బ్యాంక్ ఖాతా, రేషన్‌కార్డు జిరాక్స్ కాపీలను జతపరచాలని సూచించారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

పారిశుధ్య కార్మికుడి మృతి



పారిశుధ్య కార్మికుడు కొండన్నకు నివాళులర్పిస్తున్న ఎంహెచ్‌ఓ విష్ణుమూర్తి

అనంతపురం కార్పొరేషన్: నగరపాలక సంస్థలో పారిశుధ్య కార్మికుడిగా విధులు నిర్వర్తిస్తున్న కొండన్న అనే వ్యక్తి ఈనెల 19 రాత్రి మృతి చెందాడు. గురువారం ముత్యాలమ్మ కాలనీకి వెళ్లిన ఎంహెచ్‌ఓ డాక్టర్ విష్ణుమూర్తి.. బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. పారిశుధ్య కార్మికుడు కొండన్న మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు.

ఏఆర్ ఎస్ఐ చంద్రశేఖర్‌ను అరెస్టు చేయాలి

అనంతపురం టవర్‌క్లాక్: ఏఆర్ ఎస్ఐ చంద్రశేఖర్‌ను అరెస్టు చేసి గిరిజన మహిళ సాకే అంజలికి న్యాయం చేయాలని జైభీమ్ రావు భారత్ పార్టీ అధ్యక్షుడు రామాంజనేయులు కోరారు. గురువారం స్థానిక ఎస్పీ కార్యాలయం ఎదురుగా ఆయన విలేకరులతో మాట్లాడారు. గిరిజన మహిళ అయిన సాకే అంజలిని పెళ్లి చేసుకుని మోసం చేసిన ఏఆర్ ఎస్ఐ చంద్రశేఖర్‌పై వెంటనే చర్యలు తీసుకోవాలన్నారు. కేవలం పోలీసు అధికారి అనే కారణంతో అతడిపై చర్యలు తీసుకోకపోవడం దారుణమని మండిపడ్డారు. గిరిజన మహిళకు న్యాయం చేయకపోతే ఆందోళనలు చేపడతామన్నారు. బాధితురాలు అంజలి మాట్లాడుతూ.. ఏఆర్ ఎస్ఐ చంద్రశేఖర్ తనను పెళ్లి చేసుకుని వదిలేశాడని తెలిపింది. మాకు పుట్టిన కుమారుడికి 14 సంవత్సరాల వయస్సు ఉందన్నారు. మమ్మల్ని మోసం చేసిన ఏఆర్ ఎస్ఐ చంద్రశేఖర్‌పై పోలీసులకు ఫిర్యాదు చేశామని పేర్కొన్నారు. దీంతో కక్ష పెంచుకున్న అతడు తనను చంపేందుకు ఇంటి వద్దకు వచ్చాడన్నారు. ఈ ఘటనపై మళ్లీ పోలీసులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తం చేసింది. ఉన్నతాధికారులు చొరవ తీసుకుని న్యాయం చేయాలని కోరుతోంది. కార్యక్రమంలో బండారు కుళ్లాయప్ప, వీరా, చిరంజీవి, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్పీకి ఫిర్యాదు..

అనంతపురం: ఏఆర్ ఎస్ఐ చంద్రశేఖర్‌పై చర్యలు తీసుకోవాలని సాకే అంజలి అనే మహిళ గురువారం జిల్లా ఎస్పీ గౌతమి శాలికి ఫిర్యాదు చేసింది. వెంటనే తమకు న్యాయం చేయాలని కోరింది. ఎస్టీ కేటగిరీ చెందిన తనపై తరచూ వేధింపులకు పాల్పడుతున్నాడని ఆవేదన వ్యక్తం చేసింది. కొడవలి తీసుకొచ్చి చంపుతానని బెదిరిస్తున్నాడని వాపోయింది. ఏఆర్ ఎస్ఐ చంద్రశేఖర్‌పై చర్యలు తీసుకోవాలని కోరింది.

అనధికార నిర్మాణాలను ఉపేక్షించం

- 200 భవనాలపై చార్జ్‌షీట్లు
- త్వరలో అపరాధ రుసుము వసూలు చేస్తాం
- ప్లాస్టిక్ నియంత్రణలో ప్రజల భాగస్వామ్యం కీలకం
- 'సాక్షి'తో నగరపాలక సంస్థ కమిషనర్ మేఘ స్వరూప్



నగరపాలక సంస్థ కమిషనర్ మేఘ స్వరూప్

సాక్షి ఇంటర్వ్యూ

అనంతపురం కార్పొరేషన్: నిబంధనలకు లోబడి భవన నిర్మాణాలు చేపట్టాలి. పట్టణ ప్రణాళిక అనుమతులు లేకుండా నిర్మాణాలు చేపట్టినా.. అనుమతులు తీసుకుని నిర్మాణం మరోలా చేపట్టినా (అతిక్రమణలు) ఏమాత్రం ఉపేక్షించేది లేదు. చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని కమిషనర్ మేఘ స్వరూప్ నిర్మాణదారులను హెచ్చరించారు. నగరాభివృద్ధికి తీసుకుంటున్న చర్యలపై గురువారం కమిషనర్ మేఘ స్వరూప్‌తో సాక్షి చిట్‌చాట్ నిర్వహించింది. మరిన్ని వివరాలు ఆయన మాటల్లోనే..

సాక్షి: అనధికార నిర్మాణాలపై మీరు తీసుకునే చర్యలు?

కమిషనర్: పట్టణ ప్రణాళిక అనుమతులు పాటించేలా ప్లానింగ్ కార్యదర్శులు, టౌన్ ప్లానింగ్ విభాగాలకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశాం. నిబంధనలు పాటించని భవనాలకు నోటీసులు జారీ చేశాం. తదుపరి చర్యలు ఉంటాయి.

సాక్షి: అతిక్రమణలపై ఏమైనా చర్యలు తీసుకున్నారా?

కమిషనర్: గత కొన్నేళ్లుగా నగరంలో నిబంధనలకు విరుద్ధంగా నిర్మిస్తున్న బహుళ అంతస్తులు, వివిధ భవనాల అతిక్రమణలు, తదితర వాటిపై చార్జ్‌షీట్ దాఖలు చేశాం. పలు భవనాలపై చర్యలు తీసుకున్నాం.

సాక్షి: ఎన్ని చార్జ్‌షీట్లు దాఖలు చేశారు? తదుపరి చర్యలేమిటి?

కమిషనర్: ఇప్పటి వరకు 200 భవనాలపై చార్జ్‌షీట్‌లు దాఖలు చేశాం. న్యాయస్థానం సూచనల మేరకు త్వరలో చార్జ్‌షీట్ దాఖలు చేసిన భవన నిర్మాణదారులతో అపరాధ రుసుం వసూలు చేస్తాం. చెల్లించని పక్షంలో కఠిన చర్యలు తీసుకుంటాం.

సాక్షి: ప్లాస్టిక్ నియంత్రణ అమలు ఏ విధంగా చేపట్టబోతున్నారు?

కమిషనర్: ప్రధానంగా ప్లాస్టిక్ నియంత్రణలో ప్రజల భాగస్వామ్యం ఎంతో కీలకం. నిషేధిత ప్లాస్టిక్‌ను వినియోగించకుండా పకడ్బందీ చర్యలు తీసుకున్నాం. ఇప్పటికే ఆటోలు, సచివాలయ సిబ్బంది ద్వారా విస్తృత ప్రచారం నిర్వహించాం. ప్రజలు భావితరాల కోసం స్వచ్ఛందంగా ప్లాస్టిక్‌ను నిషేధించాలి.

సాక్షి: ప్లాస్టిక్ విక్రయాలపై స్పెషల్ డ్రైవ్ చేస్తారా?

కమిషనర్: ప్లాస్టిక్‌ను నిషేధించడానికి ప్రణాళిక బద్ధంగా ముందుకెళ్తున్నాం. ఇప్పటికే స్పెషల్ డ్రైవ్ నిర్వహించేలా అధికారులను నియమించాం. ప్లాస్టిక్ విక్రయాలు, వినియోగించే వారిపై జరిమానా వేయడంతో పాటు ట్రేడ్ లైసెన్స్ కూడా రద్దు చేస్తాం.

సాక్షి: దోమకాటు నివారణకు తీసుకుంటున్న చర్యలు?

కమిషనర్: వర్షాకాలంలో దోమకాటు వ్యాధులు ప్రబలే అవకాశం అధికం. దోమ లార్వాలు వృద్ధి చెందకుండా ఫాగింగ్, స్ప్రేయింగ్, ఆయిల్‌బాల్స్ కాలువల్లో చేపట్టేలా చర్యలు తీసుకున్నాం. నివారణ చర్యలపై నగరపాలక సంస్థ సిబ్బందికి శిక్షణ ఇప్పించడం జరిగింది.

సాక్షి: వరద సమస్యను ఏవిధంగా నివారిస్తారు?

కమిషనర్: కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్ ఆదేశాలతో నగరంలోని నడిమివంక, మరువ వంకల్లో పూడికతీత, పిచ్చి మొక్కలు తొలగించేలా చర్యలు తీసుకున్నాం. అదేవిధంగా పెద్ద కాలువ్లో పూడికతీత పనులు చేపట్టాం. తద్వారా ఎక్కడా కాలువలు బ్లాక్ అవకుండా సజావుగా మురుగు ప్రవహిస్తుంది. తద్వారా భారీ వర్షాలు వచ్చినా.. ఎటువంటి సమస్యలు ఉండవు.

సాక్షి: చెత్త నిర్వహణ కొనసాగిస్తారా?

కమిషనర్: చెత్త నిర్వహణ కొనసాగించేలా చర్యలు తీసుకుంటాం. నగరంలోని వివిధ డివిజన్ల పరిధిలో రోజూ 125 టన్నుల చెత్త ఉత్పత్తి అవుతోంది. అందులో 65 నుంచి 70 శాతం పొడిచెత్త ఉంటుంది. రానున్న రోజుల్లో తడి చెత్తను వర్మీకంపోస్టుకు ఉపయోగించుకునేలా చర్యలు తీసుకుంటాం. ఇక మిగతా చెత్తను కంపోస్టుకు తరలించి, అక్కడ చెత్త నిర్వహణ చేపడుతాం. వినియోగానికి రాని ప్లాస్టిక్, తదితర వ్యర్థాలను సిమెంట్ ఫ్యాక్టరీలకు పంపుతాం.

సాక్షి: చెత్త నిర్వహణ బాధ్యత ఏజెన్సీకి ఇస్తారా?

కమిషనర్: చెత్త నిర్వహణ బాధ్యతను నగరపాలక సంస్థ నిర్వహించేలా చూస్తాం. బయోమైనింగ్ పద్ధతిలో చెత్త నిర్వహణ చేపట్టేందుకు రూ.1.5 కోట్లతో మిషన్ కొనుగోలు చేస్తాం. నగరాభివృద్ధికి పటిష్టమైన చర్యలు తీసుకుంటాం. ప్రజలు సైతం చెత్తను ఎక్కడపడితే అక్కడ వేయకుండా నగరపాలక సంస్థ వాహనాలకు అందించాలి. నగరాభివృద్ధిలో ప్రజలు భాగస్వాములవ్వాలి.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి



మాట్లాడుతున్న వైద్యుడు ప్రసాద్

రాప్తాడురూరల్: వర్షాకాలం ప్రారంభమైన నేపథ్యంలో సీజనల్ వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎంపీడీఓ పుల్లయ్య, డాక్టర్ కె.ప్రసాద్ సూచించారు. గురువారం స్థానిక అనంతపురం రూరల్ ఎంపీడీఓ కార్యాలయంలో సమావేశం ఏర్పాటు చేశారు. సీజనల్ వ్యాధులు వ్యాపించకుండా తీసుకోవాల్సిన చర్యలపై వివిధ శాఖల అధికారులు పంచాయతీ కార్యదర్శులు, ఏఎన్ఎంలు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లకు సూచనలు ఇచ్చారు. ప్రతి శుక్రవారం డ్రైడే పాటించేలా ప్రజలకు అవగాహన కల్పించాలని డాక్టర్ కె.ప్రసాద్ తెలిపారు. శుభ్రమైన తాగునీరు తీసుకోవాలని కోరారు. పారిశుధ్య నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. సమావేశంలో ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ ఆంజనేయులు, ఈఓఆర్డీ దామోదర్‌రెడ్డి పాల్గొన్నారు.

దరఖాస్తు చేసుకున్న వారికి సీట్లు ఇవ్వాలి



జీసీడీఓ వాణీదేవికి వినతిపత్రం అందజేస్తున్న ఏఐఎస్ఎఫ్ నాయకులు

అనంతపురం ఎడ్యుకేషన్: అనాథ, పేద ఆడపిల్లల కోసం ఏర్పాటు చేసిన కేజీబీవీల్లో దరఖాస్తు చేసుకున్న విద్యార్థినులందరికీ సీట్లు కేటాయించాలని ఏఐఎస్ఎఫ్ఐ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం సమగ్ర శిక్ష కార్యాలయం వద్ద ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో ఆందోళన చేశారు. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రమణయ్య, కుళ్లాయిస్వామి మాట్లాడారు. దేశంలోనే అత్యంత కరువు జిల్లాల్లో రెండో స్థానంలో ఉన్న అనంతపురం జిల్లాను దృష్టిలో పెట్టుకొని పేద విద్యార్థినులకు కేజీబీవీల్లో చదువుకునే అవకాశం కల్పించాలని డిమాండ్ చేశారు. జిల్లాలో పేద, మధ్య తరగతి బడుగు బలహీన వర్గాల ప్రజలు ఉపాధి కోసం ఇతర రాష్ట్రాలకు వలస వెళ్తున్నారని తెలిపారు. అలాంటి వారు తమ ఆడపిల్లలను ఇళ్ల వద్దే ఉంచి చదివించాలంటే ఇబ్బందులు పడుతున్నారని గుర్తు చేశారు. కేజీబీవీ పాఠశాలల్లో అయితే భద్రత ఉంటుందనే ఉద్దేశంతో చాలామంది తల్లితండ్రులు దరఖాస్తు చేసుకున్నారన్నారు. వారి పిల్లలందరికీ అవకాశం కల్పించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రభుత్వం కేజీబీవీలకు సంబంధించి అదనపు సెక్షన్లు పెంచాలన్నారు. ఖాళీగా ఉన్న బోధన, బోధనేతర పోస్టులను తక్షణమే భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. కేజీబీవీల ఎస్‌ఓలు స్థానికంగా ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం జీసీడీఓ వాణీదేవికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా కోశాధికారి హనుమంతు, నగర అధ్యక్ష కార్యదర్శులు మంజునాథ్, ఉమామహేష్, జిల్లా ఉపాధ్యక్షులు వంశీ, నగర నాయకులు హరికృష్ణ, సమీర్, హర్ష ఆనంద్, విశ్వ పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంపై ముగిసిన శిక్షణ



మాట్లాడుతున్న కలెక్టర్ వినోద్‌కుమార్



శిక్షణలో పాల్గొన్న జాంబియా దేశ డెలిగేట్స్

అనంతపురం అర్బన్: జిల్లాలోని ప్రకృతి వ్యవసాయంపై జాంబియా దేశానికి చెందిన 16 మంది డెలిగేట్లు ఈనెల 8వ తేదీ నుంచి గురువారం వరకు శిక్షణ పొందారని కలెక్టర్ వినోద్‌కుమార్ తెలిపారు. గురువారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో కలెక్టర్‌తో జాంబియా దేశ డెలిగేట్లు సమావేశమై ప్రకృతి వ్యవసాయంపై కలెక్టర్‌తో చర్చించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాలో ప్రకృతి వ్యవసాయంలో ఏ గ్రేడ్ మోడల్, ఏటీఎం మోడల్, డీఆర్‌పీఎం మోడల్‌లో శిక్షణ ఇవ్వడం జరిగిందన్నారు. జూలై నెలలో మన జిల్లా నుంచి ప్రకృతి వ్యవసాయంలో ప్రావీణ్యులైన సుకన్య, రవిచంద్ర, శివశంకర్, సుధాకర్ జాంబియాకు వెళ్లి వ్యవసాయ విధానాలను వారికి నేర్పిస్తారన్నారు. కార్యక్రమంలో జెడ్పీ సీఈఓ వైఖోమ్ నిదియాదేవి, నగర పాలక కమిషనర్ మేఘ స్వరూప్, జిల్లా వ్యవసాయ అధికారి ఉమామహేశ్వరమ్మ, జాంబియా టీమ్‌కు చెందిన సెబాష్టియన్, మాంజా, ముండియా, సెలిషియన్, సీటీ అండ్ ఎల్‌ఓ డీపీఎం లక్ష్మీనాయక్, తదితరులు పాల్గొన్నారు.

ప్రజల ముంగిటకే రెవెన్యూ సేవలు



మాట్లాడుతున్న తహసీల్దార్ సీతారాం

రాప్తాడు: ప్రజలు, రైతుల ముంగిటకే రెవెన్యూ సేవలు అందించడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం పని చేస్తోందని తహసీల్దార్ సీతారాం అన్నారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో గురువారం 'రెవెన్యూ దినోత్సవాన్ని' నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో తహసీల్దార్ మాట్లాడారు. ప్రజలు, రైతుల ముంగిటకే ప్రభుత్వ సంక్షేమ పథకాలు, రెవెన్యూ సేవలను అందించడమే లక్ష్యంగా సిబ్బంది పని చేస్తున్నారని తెలిపారు. రైతులు, ప్రజల నిరంతర సేవలో రెవెన్యూ శాఖ పని చేస్తోందన్నారు. రైతులకు భూములకు సంబంధించి ఏ సమస్య ఉన్న రైతులు తమ దృష్టికి తీసుకువస్తే వెంటనే పరిష్కరిస్తామన్నారు. తమ కార్యాలయ పరిధిలో రైతులకు ఆర్ఎస్ఆర్, ఎంఎంబీ, గ్రామ అడంగల్, 1బీ పత్రాలు కావాలంటే సకాలంలో అందజేస్తామన్నారు. అలాగే ప్రజలకు కులం, ఆదాయ ధ్రువీకరణ పత్రాలను కూడా నిర్ణీత గడువులోపు పంపిణీ చేస్తామన్నారు. రెవెన్యూ సేవలపై రైతులు, ప్రజలకు సమగ్రంగా వివరించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ గీతావాణి, ఈఓఆర్డీ నరసింహ రెడ్డి, సర్పంచ్ సాకే తిరుపాలు రిటైర్డ్ డిప్యూటీ తహసీల్దార్ రామాంజనేయులు, రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

విధులకు హాజరుకాకపోతే చర్యలు

- ఎంపీడీఓ గీతావాణి
- 10 మంది సచివాలయ సిబ్బందికి మెమోల జారీ



మాట్లాడుతున్న ఎంపీడీఓ గీతావాణి

రాప్తాడు: విధులకు సక్రమంగా హాజరు కాకపోతే చర్యలు తప్పవని సచివాలయ ఉద్యోగులపై ఎంపీడీఓ గీతావాణి ఆగ్రహం వ్యక్తం చేశారు. విధులకు రాకుండా అలసత్వం ప్రదర్శిస్తే ఎవరినీ ఉపేక్షించేది లేదని, శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గురువారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో సచివాలయ ఉద్యోగులతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మండలంలోని హంపాపురం గ్రామ సచివాలయ సిబ్బంది విధులకు సక్రమంగా హజరు కావడం లేదన్నారు. ఈనెల 15న 'సారోళ్లు ఎక్కడికి వెళ్లారో', ఈనెల 16న 'మారని సచివాలయ సిబ్బంది తీరు' శీర్షికలతో రెండు కథనాలు సాక్షిలో ప్రచురితమయ్యాయని తెలిపారు. జిల్లా కలెక్టర్ వి.వినోద్ కుమార్ ఆదేశాల మేరకు విధులకు హాజరు కాని 10 మంది సిబ్బందికి మెమోలు జారీ చేయడం జరిగిందన్నారు. ఇప్పటికే విధులకు హజరు కాని సిబ్బంది సంజాయిషీ రాసి ఇవ్వడం జరిగిందన్నారు. ప్రజలకు సకాలంలో సేవలు అందించడానికే సచివాలయ వ్యవస్థను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. గ్రామాల్లో అర్హత ఉన్న వారందరికీ సంక్షేమ పథకాలు అందించేందుకు కృషి చేయాలని సూచించారు. సిబ్బంది సమయానికి విధులకు హాజరై, సక్రమంగా పని చేయలన్నారు. ఇప్పటి నుంచి మండలంలో ప్రతి సచివాలయాన్ని సందర్శిస్తానని వెల్లడించారు. విధులకు రాకుండా నిర్లక్ష్యం చేసే సిబ్బందిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు చేపట్టాలి

గ్రామీణ ప్రాంతాల్లో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు చేపట్టాలని ఎంపీడీఓ గీతావాణి ఆదేశించారు. వర్షాకాలంలో మలేరియా, డెంగీ, అతిసారం వంటి సీజనల్ వ్యాధులు అధికంగా ప్రబలే అవకాశం ఉందన్నారు. ఈ నేపథ్యంలో ప్రతి ఒక్కరూ తగిన జాగ్రత్తలు పాటించాలన్నారు. వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రత కూడా పాటించాలన్నారు. ప్రధానంగా మురుగు నీటి నిల్వలు, చెత్తా చెదారం ఉన్నచోట దోమలు ఎక్కువగా పెరిగే అవకాశం ఉందని తెలిపారు. వీటి కారణంగా మలేరియా, డెంగీ జ్వరాలు సోకుతాయన్నారు. ప్రతి గ్రామంలో దోమల నివారణ మందు పిచికారీ పనులను ముమ్మరం చేయాలన్నారు. అలాగే కాలువలు, మురుగు నీటి నిల్వల ప్రాంతాలు, ఇళ్ల వద్ద దోమల నివారణ మందు పిచికారీ చేయించాలన్నారు. ప్రతి శుక్రవారం డ్రైడే తప్పనిసరిగా పాటించాలని సూచించారు. ఇంటి పరిసరాల్లో మురుగునీటి నిల్వలు లేకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో ఈఓఆర్డీ నరసింహారెడ్డి, సచివాలయ ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

దళిత క్రైస్తవుల హక్కులను కాపాడుకుందాం



కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకుంటున్న పాస్టర్లు

అనంతపురం కల్చరల్: ఏఐఎస్ఎఫ్ (ఆల్ఇండియా క్రిస్టియన్ ఫెడరేషన్) 28వ వార్షికోత్సవ వేడుకలు గురువారం రాత్రి సందడిగా జరిగాయి. స్థానిక అరవింద నగర్‌లోని జీసెస్ కంపాషన్ చర్చిలో సంస్థ జిల్లా అధ్యక్షుడు విల్సన్ నేతృత్వంలో జరిగిన వేడుకల్లో జిల్లా పాస్టర్ల సంఘం అధ్యక్షుడు రెవరెండ్ మోజెస్ అనిల్‌కుమార్ ఆత్మీయ అతిథిగా పాల్గొని ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కొఠారి డేనియల్, రాష్ట్ర కార్యదర్శి క్రాంతి జాన్‌వెస్లీ, ఐసిఎఫ్ జిల్లా అధ్యక్షుడు కమలాకర్‌రావు తదితరులు మాట్లాడారు. గద్దెపాటి విజయరామరాజు దళిత క్రైస్తవుల హక్కులు, సంక్షేమం గురించి దశాబ్దాల కిందటే సంస్థను ప్రారంభించారన్నారు. అదే స్ఫూర్తితోనే జిల్లాలో కూడా అనేక అవగాహన, సేవా కార్యక్రమాలు సాగుతున్నాయన్నారు. క్రైస్తవుల హక్కులను కాపాడుకునేందుకు, సంస్థను మరింత బలోపేతం చేయడానికి అందరూ కృషి చేయాలని సభ్యులకు సూచించారు. అంతకు ముందు సామూహిక ప్రార్థనలు చేసి కేక్ కటింగ్‌తో సంతోషాలను పంచుకున్నారు. కార్యక్రమంలో సంస్థ సభ్యులు నెల్లూరి కిరణ్‌కుమార్, ప్రణయ్, జీవన్ షాలెంతో పాటూ పలువురు పాస్టర్లు పాల్గొన్నారు.

బాధ్యతలను నిబద్ధతతో నిర్వర్తించాలి



మాట్లాడుతున్న ఆర్డీఓ గ్రంధి వెంకటేష్

అనంతపురం అర్బన్: ప్రజలతో మమేకమై పని చేసే శాఖల్లో అత్యంత కీలకమైనది రెవెన్యూ శాఖ అని, ఈ క్రమంలో రెవెన్యూ ఉద్యోగులు నిబద్ధతతో బాధ్యతలు నిర్వర్తించాల్సిన అవసరం ఎంతైనా ఉందని అనంతపురం ఆర్డీఓ గ్రంధి వెంకటేష్ అన్నారు. రెవెన్యూ డే సందర్భంగా అనంతపురంలోని రెవెన్యూ హోమ్‌లోని రెవెన్యూ ఉద్యోగుల సంఘం కార్యాలయంలో గురువారం సంబరాలు నిర్వహించారు. సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎస్.బి.కుళ్లాయప్ప, ఆర్.ఎస్.దివాకర్‌రావు ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకలకు ముఖ్యఅతిథిగా ఆర్‌డీఓ హాజరై సంఘం జెండాను ఆవిష్కరించారు. రెవెన్యూ సంఘం వ్యవస్థాపకుడు తోట సుధాకర్‌ప్రసాద్‌కు నివాళులర్పించారు. ఆర్‌డీఓ మాట్లాడుతూ.. మెరుగైన సేవలు సత్వరం అందించేందుకు ప్రతి రెవెన్యూ ఉద్యోగి చిత్తశుద్ధితో పనిచేయాలన్నారు. అధ్యక్ష, కార్యదర్శులు మాట్లాడుతూ రెవెన్యూ ఉద్యోగుల సంఘం కృషి ఫలితంగా రెవెన్యూ దినోత్సవాన్ని అధికారికంగా నిర్వహించుకోగలుగుతున్నట్లు గుర్తు చేశారు. సమస్యల పరిష్కారానికి శక్తివంచన లేకుండా కృషి చేస్తామన్నారు. విశ్రాంత రెవెన్యూ ఉద్యోగులను సన్మానించారు. కార్యక్రమంలో సంఘం కార్యనిర్వాహక కార్యదర్శి భోగన్న గౌడ్, రెవెన్యూ కో–ఆపరేటివ్ కోశాధికారి సంజీవరాయుడు, డైరెక్టర్ విశ్వనాథ్, డివిజన్ కార్యదర్శి మంజునాథ్, వీఆర్‌ఓ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు గోపాల్ రెడ్డి, రామకృష్ణ, అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల సంఘం నాయకులు భాస్కర్, నాగేంద్రపాల్గొన్నారు.

రెవెన్యూ సేవలను చేరువ చేద్దాం

అనంతపురం రూరల్: అధికారులు చిత్తశుద్ధితో పని చేస్తేనే రెవెన్యూ సేవలు ప్రజలకు మరింత చేరువ అవుతాయని అనంతపురం రెవెన్యూ డివిజన్ అధికారి గ్రంధి వెంకటేష్ పేర్కొన్నారు. గురువారం డ్వామా కార్యాలయ సమావేశ మందిరంలో రెవెన్యూ శాఖ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీఓ మాట్లాడుతూ.. రెవెన్యూ అధికారులు చిత్తశుద్ధితో పని చేస్తేనే ప్రజల సమస్యలను పరిష్కరించవచ్చన్నారు. వివిధ సమస్య పరిష్కారం కోసం కార్యాలయాలకు వచ్చే ప్రజలతో అధికారులు సఖ్యతగా మెలగాలన్నారు. రెవెన్యూ వ్యవస్థలో అనేక సంస్కరణలు తీసుకురావడంతో భూ సమస్యలకు పరిష్కారం లభించిందని తెలిపారు. అనంతరం ఇటీవల పదవీ విరమణ చేసిన సిబ్బంది, ఎన్నికల విధుల్లో పాల్గొన్న సిబ్బందిని ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో అనంతపురం అర్బన్ తహసీల్దార్ శివరామిరెడ్డి, రిటైర్డ్ ఉద్యోగులు తిరుమల రెడ్డి, కుమార స్వామి తదితరులు పాల్గొన్నారు.

'నీట్' అక్రమాలపై విచారణ జరిపించాలి



నిరసన తెలుపుతున్న సీపీఐ (ఎంఎల్) లిబరేషన్ పార్టీ నాయకులు

అనంతపురం ఎడ్యుకేషన్: నీట్ పరీక్షల్లో జరిగిన అవకతవకలకు కేంద్ర ప్రభుత్వమే బాధ్యత వహించాలని సీపీఐ (ఎంఎల్) లిబరేషన్ పార్టీ నాయకులు డిమాండ్ చేశారు. అరుంధతీ రాయ్, షేక్ షౌకత్ హుస్సేన్‌పై అక్రమంగా కేసులు పెట్టి ప్రజాస్వామ్య వాదులను ఇబ్బందులకు గురి చేయడాన్ని ఖండించారు. గురువారం ఆలిండియా స్టూడెంట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అనంతపురంలో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సీపీఐ (ఎంఎల్) లిబరేషన్ జిల్లా కార్యదర్శి టీఎస్ వలి, ఏఐఎస్ఏ జిల్లా అధ్యక్షుడు రొద్దం శివకుమార్, జిల్లా కన్వీనర్ బాలకృష్ణ మాట్లాడారు. తక్షణమే ఎన్‌టీఏను రద్దు చేయాలన్నారు. బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరారు. సామాజికవేత్త అరుంధతీ రాయ్, ప్రొఫెసర్ షేక్ షౌకత్ హుస్సేన్‌పై పెట్టిన 'ఊపా' కేసులను రద్దు చేయాలన్నారు. ఎన్డీఏ ప్రభుత్వం దేశంలోని ప్రజాస్వామ్య వ్యక్తులపై తప్పుడు కేసులు పెడుతూ వాళ్ల గొంతులు నొక్కాలని చూస్తోందన్నారు. నీట్ అక్రమాలపై సుప్రీం కోర్టు జడ్జితో విచారణ చేయించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఐ (ఎంఎల్) లిబరేషన్ పార్టీ జిల్లా నాయకులు పరుశురాం, మహిళా సంఘం సుజాతమ్మ, జిల్లా కార్యవర్గ సభ్యులు మహేష్, హేమంత్, అనిల్, మారుతి, అరవింద్, నరేంద్ర, భారత్, శ్రవణ్ కుమార్, రఘు, అనిల్, మనోజ్ పాల్గొన్నారు.

మాకు రక్షణ కల్పించండి

అనంతపురం: మా కుటుంబానికి రక్షణ కల్పించాలని బుక్కరాయసముద్రం మండలం వెంకటాపురం గ్రామానికి చెందిన చాకలి మునెమ్మ గురువారం జిల్లా ఎస్పీ గౌతమి శాలికి గురువారం వినతి పత్రం అందజేశారు. గత 20 సంవత్సరాలుగా తమకు ఉన్న రెండు ఎకరాల భూమిని సాగు చేసుకుంటున్నామని పేర్కొన్నారు. తన భర్త చాకలి నాగయ్య గురువారం పొలం దున్నడానికి వెళ్లడంతో అక్కులప్ప, సుబ్బారాయుడుతో పాటు మరి కొంత మంది పొలం దున్నకుండా అడ్డుకున్నారని ఫిర్యాదు చేసింది. గతంలో బుక్కరాయసముద్రం మండలం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినప్పటికీ ఫలితం లేకపోయిందన్నారు. తహసీల్దార్ ఇచ్చిన పాసుపుస్తకాన్ని ఎస్పీకి చూపించారు.

ప్రత్యామ్నాయ మార్గం చూపండి

ఉరవకొండ: పట్టణంలో తాగునీటి ఇబ్బంది రాకుండా ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టాలని, ఎక్కడా అలసత్వం ప్రదర్శించొద్దని జాయింట్ కలెక్టర్ కేతన్‌గార్గ్ ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులను ఆదేశించారు. గురువారం మండలంలోని నింబగల్లు సమ్మర్ స్టోరేజ్ ట్యాంకును కేంద్ర బృందం సభ్యులు పరిశీలించారు. ఈసందర్భంగా ఉరవకొండలో తీవ్ర తాగునీటి ఎద్దడి నెలకొందని ఇంటర్ మినిస్టీరియల్ సెంట్రల్ టీం సభ్యుల దృష్టికి రైతులు, ప్రజలు తీసుకెళ్లారు. ఈసందర్భంగా ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ హేసాన్‌బాషా, డీఈ అంజుమన్ సఫ్రీన్, జేఈ ఫామీదాబేగంతో కేంద్ర బృందం సభ్యులు చర్చించారు. ఈసందర్భంగా జాయింట్ కలెక్టర్ కేతన్ గార్గ్ మాట్లాడుతూ ఉరవకొండలో తాగునీటి వనరులను సద్వినియోగం చేసుకోవడంలో ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు విఫలమయ్యారని అసహనం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో కేంద్ర బృంద సభ్యులు రితేష్‌చౌహాన్, డాక్టర్ పొన్నుస్వామి, వెల్ఫేర్ డిప్యూటీ డైరెక్టర్ సునీల్‌దూబే తదితరులు పాల్గొన్నారు.

పండ్ల తోటల పెంపకానికి దరఖాస్తుల ఆహ్వానం

గుత్తి రూరల్: మండలంలోని 24 గ్రామ పంచాయతీల్లో పండ్ల తోటల పెంపకానికి సన్న, చిన్నకారు రైతులు దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీఓ శ్రీనివాసులు గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. మండల పరిషత్ కార్యాలయంలోని ఉపాధి హామీ కార్యాలయంలో సంప్రదించాలని ఆయన సూచించారు.